సాక్షి
విజయనగరం
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



### నదిలో గల్లంతైన యువకుడి మృతి

నాగావళి నదిలో గల్లంతైన యువకుడు అన్నె కార్తీక్(17) మృతదేహం వీరఘట్టం మండలం కడకెల్ల సమీపంలోని నదీ తీరంలో శుక్రవారం లభ్యమైంది.

- 8లో



### ఆయువు తీసిన అక్రమ క్వారీ

టీడీపీ నేతకు చెందిన అక్రమ క్వారీ ఓ విద్యార్థి మృతికి కారణమైంది. ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది.

- 8లో



### ఈదురగాలులతో కూలిన చెట్లు

శృంగవరపుకోట: ఎస్.కోట మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. బొడ్డవర రోడ్డులో చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. చెట్లు తొలగించి విద్యుత్ సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు.

ఇఫ్తార్ | సహర్
శని (సా॥) 6:15 | ఆది (ఉ॥) 4:28

రంజాన్ వేళలు

## న్యూస్‌రీల్

### ఎమ్మెల్సీ సురేష్‌బాబుకు సత్కారం



సురేష్‌బాబును సత్కరిస్తున్న రేగాన, తదితరులు

నెల్లిమర్ల: ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబును ఏపీ టూరిజమ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల గోవిందరావు, సంచాన శ్రీనివాసరావు శుక్రవారం మర్యాదపూర్వంగా కలిశారు. రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైనందుకు అభినందిస్తూ ఆయన ఇంటిలోనే దుశ్శాలువతో సత్కరించారు.

### బాధ్యతల స్వీకరణ



సూర్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఎయిడ్స్, కుష్టు, క్షయ నివారణ అధికారిగా డాక్టర్ ఎస్.సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషిచేస్తానన్నారు.

### లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం

- డీఎంహెచ్‌ఓ రమణకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యానేరమని, నిబంధనలు అతిక్రమించిన స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్.వి.రమణకుమారి హెచ్చరించారు. తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు పరీక్షలకు వినియోగించాల్సిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ఆడ పిల్లలు తక్కువగా ఉన్న మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. పీసీపీఎన్‌డీటీ చట్టంపై సఖి గ్రూపులు ద్వారా అవగాహన కల్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని క్లినిక్‌లు, ఆస్పత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ జగదీష్, రేడియాలజిస్టులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ మధుకర్, సుబ్బలక్ష్మి, చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

### రైతన్నకు డీసీసీబీ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చినరామునాయుడు

విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా జిల్లా రైతాంగానికి నాణ్యమైన సేవలందిస్తున్నామని డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు తెలిపారు. స్థానిక డీసీసీబీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు వచ్చినప్పటికీ ఈ ఏడాది 22 శాతం అభివృద్ధి సాధించామన్నారు. 2022-23 నాటికి డీసీసీబీ వ్యాపారం రూ.1543 కోట్ల నుంచి రూ.1900 కోట్లకు చేరిందన్నారు. బ్యాంకు రూ.28 కోట్లు లాభాన్ని ఆర్జించిందని చెప్పారు. ఈ ఏడాది వేపాడ, దత్తిరాజేరు, మెంటాడ, భోగాపురం, మెరకముడిదాం, గరుగుబిల్లిలో బ్రాంచిల ఏర్పాటుకు రిజర్వ్ బ్యాంకు అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.2,300 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ సీఈఓ కె.జనార్దన, డైరెక్టర్లు పి.సంజీవి, ఎల్.నారాయణరావు, బోని అప్పలనాయుడు, సీహెచ్ వెంకటరమణ, అంబటిరాధ, నాబార్డు డీడీఎం టి.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## కనులపండువగా
# రాములోరి పట్టాభిషేకం

నెల్లిమర్ల రూరల్:

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు, రుత్వికులు వేకువజామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహాపట్టాభిషేకం సజావుగా సాగాలని ముందుగా విశ్వక్సేనుడికి పూజలు చేశారు. అనంతరం పూజాద్రవ్యాలకు పుణ్యాహవచనం జరిపారు. అష్టోత్తర సహస్ర నామార్చనలతో స్వామివారికి విశేషపూజలు చేశారు. ఉదయం 9 గంటలకు సీతారామచంద్ర ప్రభువుల వారిని ఆస్థాన మండపంలో వేంచిపజేసి రాములోరిని పట్టాభిషిక్తుడిని చేశారు. దీనికి ముందు మంగళవాయిద్యాలతో రామదేవస్థానం చుట్టూ సముద్ర నదీ జలాలు, కలశాలతో ప్రదక్షిణ చేశారు. వేదమంత్రాల సాక్షిగా స్వామివారికి బంగారు కిరీటధారణ చేపట్టి పవిత్ర జలాలతో స్వామికి అభిషేకాలు జరిపారు. యాగశాలలో మహా పూర్ణాహుతిని నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్విరామంగా పారాయణాలు చేసిన రుత్వికులను ఈఓ కిశోర్‌కుమార్ ఘనంగా సత్కరించారు. అర్చకులు నరిసింహాచార్యులు, కిరణ్, పవన్, వరప్రసాద్ తదితరులు పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామివారి పట్టాభిషేకాన్ని జరిపిస్తున్న అర్చకులు, రుత్వికులు



యాగశాలలో పూర్ణాహుతి



కలశాలతో ప్రదక్షిణ

# చంద్రబాబును నమ్మొద్దు

- ప్రజలను మోసం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య
- ఎమ్మెల్యేలను కొనడం, దాయడం అలవాటు
- సీఎం జగన్ ప్రజల నాయకుడు
- ప్రజలకు మేలుచేయాలని నిరంతరం పరితపిస్తారు
- వైఎస్సార్ ఆసరా సభలో జెడ్పీ చైర్మన్, ఎంపీ
- డ్రాక్రామహిళలకు రూ.11,54 కోట్ల ఆసరా నిధుల చెక్కు పంపిణీ



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్, ఎంపీ

చీపురుపల్లి: ఎమ్మెల్యేను కొనడం, దాయడం, కుమ్మక్కు రాజకీయాలు చేయడం, దొంగదారిలో అధికారాన్ని సంపాదించడం, హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నైజమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలనతో ప్రజలకు మేలు చేస్తున్నారని, సింహం మాదిరిగా సింగిల్‌గానే ఎన్నికల బరిలోకి వస్తారన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా చీపురుపల్లి మండలంలో 14,727 మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.11,54,17,280 కోట్ల విలువైన చెక్కును అందజేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడుకు పారదర్శక రాజకీయాలు చేయడం ఎప్పుడూ అలవాటు లేదన్నారు. వారికున్న ఎల్లో మీడియాతో అబద్ధాలను ప్రచారం చేయడం, నిజాలు దాచేయడం పరిపాటిగా మారిందన్నారు. చంద్రబాబు పరిపాలన అంతా పెత్తందార్లు, బడాబాబులు కోసమేనన్నారు. 2014 నుంచి 2019 వరకు అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చారని వేదికలపైకి వచ్చి టీడీపీ నాయకులు చెప్పగలరా అని ప్రశ్నించారు. రాజకీయాలు, కులాలు, మతాలు, జెండాలు చూడకుండా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకం అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసిందని, ఈ ఏడాది తరగతులు కూడా ప్రారంభమవుతాయని తెలిపారు. మరికొద్ది రోజుల్లో భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణం కూడా ప్రారంభమవుతుందని స్పష్టంచేశారు. చీపురుపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసుకోగలిగామన్నారు. టీడీపీ హయాంలో దళారీ వ్యవస్థతో గ్రామాలను దోచుకున్నారే తప్ప పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. నియోజకవర్గం హద్దులు తెలియని నాయకులు అభివృద్ధి కోసం మాట్లాడుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. మహిళలు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సంతోషంగా ఉంటుందని సీఎం భావిస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మూడో విడత ఆసరా డబ్బులు మహిళల ఖాతాల్లో జమచేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందన్నారు.



మట్టి కుండలపై థాంక్యూ సీఎం సార్ అంటూ రాసి ప్రదర్శిస్తున్న సభ్యులు

#### పేద విద్యార్థుల చదువుకు భరోసా

ఆంధ్రప్రదేశ్‌లో పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని బైజూస్ యాప్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఒక్కపైసా ఖర్చు లేకుండా ఎంతో విలువైన బైజూస్ యాప్ ద్వారా పాఠ్యాంశాలు బోధిస్తున్నట్లు చెప్పారు. అదే బైజూస్ యాప్‌లో చదవాలంటే లక్షలు చెల్లించాల్సి వస్తుందన్నారు. విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమ పథకాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చోటుసంపాదించుకున్నారన్నారు. మహిళలు బాగా ఆలోచన చేయాలని, ఏమరపాటుగా చంద్రబాబుకు ఓటు వేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని, పెన్షన్ కావాలంటే లంచం ఇచ్చుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ బెవర ఉమాకుమారి, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, కె.వి.సూర్యనారాయణ రాజు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీడీ కె.సావిత్రి, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, తహసీల్దార్ ఎం.సురేష్, వెలుగు ఏసీ జి.సీతారామయ్య, ఏపీఎమ్ ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన స్వయం సహాయక సంఘాల సభ్యులు



ప్రభుత్వ విద్యలో పథకాలపై ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

## ఉత్తరాంధ్ర ఆలయాలపై
# ఆల్బమ్ చేస్తా

- సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్



విజయనగరం టౌన్:సంగీత సరస్వతి పాదాలకు ప్రణమిల్లుతూ.. విద్యలనగరాన్ని మా చిన్నాన్న మాధవపెద్ది సత్యం ఆశీస్సులతో చాలాసార్లు సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నానని సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ అన్నారు. గురు నారాయణ కళాపీఠం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అందించే పురస్కారం తీసుకునేందుకు జిల్లాకు తన సతీమణి నిర్మలతో కలిసి శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా 'సాక్షి' ముచ్చటించారు.

విజయవాడ వద్ద తెనాలి మాది. విజయవాడలో విజయ ఉంది. నేను విజయా బ్యానర్‌పై ప్రముఖ చిత్రాలు చేశాను. విజయనగరంతో మాకు ఎనలేని అనుబంధం ఉంది. 1975 నుంచి తరచుగా కీబోర్డు ప్లేయర్‌గా జిల్లాకు వచ్చేవాడిని. ఘంటసాలకు మా చిన్నాన్నకు ఎనలేని అనుబంధం ఉండేది. గానకోకిల సుశీలమ్మతో కలిసి పనిచేశాను. ఆదిభట్ల కుటుంబం అంటే చాలా ఇష్టం. ఇక్కడి గాయనీ, గాయకులతో ఉత్తరాంధ్రాలో ఉన్న ప్రముఖ ఆలయాలపై ఆల్బమ్‌ను రూపొందించాలనేది నా కోరిక. లెక్కకు మించి వచ్చిన పురస్కారాలకంటే ఘంటసాల, సుశీల, ఎస్.రాజేశ్వరరావు తిరుగాడిన నేలపై పురస్కారం అందుకోవడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నాను. సంగీతం క్షుణ్ణంగా తెలిసిన వ్యక్తి బి.ఎ.నారాయణ. అటువంటి వ్యక్తి కళాపీఠం స్థాపించి వార్షికోత్సవం చేసుకోవడం, తనను పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. విజయా సంస్థ బ్యానర్‌పై బృందావనం, భైరవద్వీపం, శ్రీకృష్ణార్జునీయం చిత్రాలు చేయడం అదృష్టం. సుమారు 70 చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించాను. ప్రస్తుతం తమిళంలో చిత్రాలు చేసేందుకు సిద్ధమవుతున్నాను. నేను పాతతరానికి, కొత్త తరానికి వారధిలా ఉన్నాను. పాత సంగీతం ఇప్పటికీ వింటూనే ఉన్నాం. మా తరంలో పాతతరంతో పాటూ మెలోడీ ఉంది. పౌరాణికాలు, జానపద చిత్రాలు ఉండేవి. ఇప్పుడు పౌరాణికాలు రావడం లేదు. రామాయణం చిత్రం జూనియర్ ఎన్‌టీఆర్‌తో చేశాను. వెరైటీ సినిమాలు రావాలి. నేటితరంలో సినిమా తీయాలంటే చాలా కష్టంతో కూడుకున్నదనడంలో అతిశయోక్తి లేదు. త్రివిక్రమ్ శ్రీనివాస్, రాజమౌళి, సుకుమార్ వంటి దర్శకులు మంచి సినిమాలు తీస్తున్నారు. కాలం మారుతున్న కొలది పాతమెలోడీస్ వస్తాయి. నాకు నచ్చింది కృతజ్ఞతా భావం. అది ఎక్కువగా ఎస్పీ బాలు వద్ద చూశాను. సంగీతం నేర్చుకునే వారందరూ అకుటుంతిత దీక్షతో సాధనచేస్తే ఉన్నతస్థాయికి వెళ్తారనేది సత్యం.

# నాణ్యతలో రాజీ వద్దు

- రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ రాహుల్‌పాండే
- రైతుబజార్లను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం



విజయనగరం ఆర్‌అండ్‌బీ రైతు బజార్‌ను పరిశీలిస్తున్న రాహుల్‌పాండే

విజయనగరం ఫోర్ట్: మార్కెటింగ్ శాఖకు సంబంధించిన గోదాంల నిర్మాణంలో నాణ్యతలో రాజీపడొద్దని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే ఆదేశించారు. విజయనగరం పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డును శుక్రవారం పరిశీలించారు. మార్కెట్‌యార్డుల్లో సమస్యలు, అభివృద్ధి పనులపై మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్షించారు. కొత్త గోదాముల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న గోదాముల్లో మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. మార్కెట్ కమిటీలు శతశాతం ఆదాయ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం విజయనగరం ఆర్‌అండ్‌బీ రైతు బజార్‌ను పరిశీలించారు. రైతుబజారు విస్తరణ పనుల్లోని షెడ్‌లకు రేకులు అమర్చేందుకు నిధులు మంజూరు చేస్తానని, పనులు పూర్తిచేయాలని మార్కెటింగ్‌శాఖ ఏడీకి సూచించారు.

బొబ్బిలి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు ఆయనకు బొబ్బిలి వీణను బహుకరించి సత్కరించారు. కార్యక్రమంలో విజయనగరం వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ నడిపేన శశిభార్గవి, ఏడీ శ్యామ్‌కుమార్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి చప్ప సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

# కొలువుదీరిన కొత్తకార్యవర్గం

- న్యాయవాదుల సంఘ అధ్యక్షునిగా దాము ఎన్నిక

విజయనగరం లీగల్: జిల్లా కేంద్ర న్యాయవాదుల సంఘ అధ్యక్షునిగా చొక్కాపు దామోదర రామ్మోహన రావు (దాము) ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థులపై 368 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సంయుక్త కార్యదర్శిగా పీటర్ మార్టిన్ తన సమీప ప్రత్యర్థి సారిక సతీష్‌పై సుమారు 253 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా పాడుగు కుమారస్వామి తన సమీప ప్రత్యర్థి యు.వి.రాజేష్‌పై 30 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లగా గుణాన రాంబాబు, సంతోషిభవానిలు విజయం సాధించారు. మహిళా రిప్రజెంటేటివ్‌గా ఆర్.రాజరాజేశ్వరి గెలిచారు. కాగా, ఉపాధ్యక్షునిగా ఎ.ఎస్.వి.అంజనీకుమార్, కార్యదర్శిగా వి.జి.సంతోష్, కోశాధికారిగా కోన చినప్పారావునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చీఫ్ ఎన్నికల అధికారిగా పెంట శ్రీరామ్మూర్తి, సహాయ ఎన్నికల అధికారులుగా పి.వరలక్ష్మి, రెడ్డి రామకృష్ణ వ్యవహరించారు.

#### ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ

ఈ నెల 15న నోటిఫికేషన్‌తో ప్రారంభమైన న్యాయవాదుల సంఘ ఎన్నికల ప్రక్రియ శుక్రవారంతో ప్రశాంతంగా ముగిసింది.

ఉదయం 10.30 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమై మధ్యాహ్నం 2.30 గంటలకు ముగిసింది. 525 మంది సభ్యులున్న సంఘంలో 466 మంది ఓటు వేశారు. సాయంత్రం 3 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించి రాత్రి 7 గంటల సమయంలో ఎన్నికల అధికారి శ్రీరామ్మూర్తి ఫలితాలు ప్రకటించారు.



ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన న్యాయవాదుల సంఘ సభ్యులు

# వేణుగోపాలుడి భూముల సర్వేపై ఆరా

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న భూముల రీసర్వేలో పట్టణంలోని పురాతన దేవాలయం వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూముల వివరాలను అప్పగించారా? లేదా? అన్న వివరాలపై దేవదాయశాఖ అధికారులు ఆరా తీశారు. బొబ్బిలి పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలోని ఈఓ కార్యాలయంలోని భూముల రికార్డులను దేవదాయ భూముల ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ డి.భారతి, జిల్లా దేవదాయాధికారి కేఎల్ సుధారాణి, సిబ్బంది పరిశీలించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న వేణుగోపాలుని భూములు ఎన్ని ఉన్నాయి? అందులో ఆక్రమణల్లో ఉన్నవెన్ని, ప్రభుత్వం గుర్తించినవెన్ని, వస్తున్న ఆదాయమెంత అన్న వివరాలతో పాటు వీటిలో ఎంత మేరకు రీసర్వే జరిగిందన్న వివరాలపై సిబ్బందిని ప్రశ్నించారు. ఆలయం పేరిట దాదాపు 4వేల ఎకరాల భూములు దేవదాయ శాఖకు చెందిన రికార్డుల్లో ఉండగా ఫలసాయం మాత్రం అంతంతమాత్రమే. అజ్జాడలోనే 714 ఎకరాల భూమి ఉండగా అందులో 473.19 ఎకరాలు వేణుగోపాలుని పేరున ఉన్నట్టు గుర్తించారు. అందులో 3.50 ఎకరాల నుంచి మాత్రమే శిస్తు వస్తున్నట్టు అధికారులు చెబుతున్నారంటే ఆలయ భూములు ఎంతలా అన్యాక్రాంతమయ్యాయో తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దేవదాయ శాఖాధికారులు శిస్తు ఇస్తున్న కొద్ది మంది రైతుల పేరిట రైతు భరోసా పథకం ప్రయోజనాలను కలిపించారు. మిగతా వారు ముందుకొస్తారనే ఈ ఆలోచన ఫలితాలనిస్తుందో లేదో చూడాలని దేవదాయ శాఖాధికారులు ఎదురు చూస్తున్నారు. మడ్డువలస ప్రాజెక్టు భూసేకరణలో కొట్టిశ గ్రామానికి చెందిన దేవుడి భూములకు దాదాపు రూ.కోటి పరిహారం వచ్చింది. వీటిలో లోక్ అదాలత్ ద్వారా సాగు చేస్తున్నవారికి 60 శాతం, దేవదాయ శాఖకు 40 శాతం వచ్చినట్టు ఈఓ పీవీ మాధవరావు, ఎస్‌డీసీ ప్రసాద్ తెలిపారు. వేణుగోపాలస్వామి భూములను రీసర్వేలో చేర్చేందుకు అన్ని మండలాల తహసీల్దార్లనూ కలసి రిపోర్టులు అందజేస్తున్నట్టు దేవదాయ శాఖ జిల్లా అధికారి కేఎల్ సుధారాణి తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఇక్కడి రికార్డుల్లోని కొన్ని కాపీలను వారు వెంట తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఈఓలు పీవీ మాధవరావు, ప్రసాద్, డీటీ కృష్ణ కుమారి, సర్వేయర్లు ఎస్.రూపవతి, పీఎస్‌ఆర్ ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఈఓ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న దేవదాయ శాఖాధికారులు

## క్లుప్తంగా

### పోలీస్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ ఎం.దీపిక

**విజయనగరం క్రైమ్:** పోలీసు ఉద్యోగుల సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ కృషిచేస్తుందని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలను ఆమె విని, పరిష్కారానికి గాను సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### తంపటాపల్లిలో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

**పాలకొండ రూరల్:** మండలంలోని తంపటాపల్లి గ్రామంలో గల అనాథపిల్లల ఆశ్రమాన్ని విజిలెన్స్ ఎస్పీ సురేష్‌బాబు ఆదేశాల మేరకు ఆశాఖ ఎస్సై బి. రామారావుతో పాటు సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న పిల్లల వివరాలను నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. పిల్లలకు అందుబాటులో ఉంచిన సౌకర్యాలపై ఆరా తీశారు. తాము సేకరించిన నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని విజిలెన్స్ ఎస్సై తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతికుమారి, సిబ్బంది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ కారుణ్య నియమాకాల భర్తీ

**విజయనగరం టౌన్:** ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు సంబంధించి పోస్టులు భర్తీ చేయనున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రజారవాణాధికారి ఆకాశపు విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెక్ రీజియన్ పరిధిలో విజయనగరం,శ్రీకాకుళాలకు సంబంధించి ఇప్పటికే కొందరికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మిగిలిన వాటిలో జూనియర్ అసిస్టెంట్, కండక్టర్, శ్రామిక్ పోస్టులను ప్రస్తుతం వారి అర్హతలను బట్టి భర్తీచేసేందుకు సన్నాహాలు చేపట్టామని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

### దొంగనోట్ల కేసులో ఆరుగురికి జైలుశిక్ష

**బొబ్బిలి:** దొంగనోట్ల చలామణీలో ఆరుగురు వ్యక్తులకు జైలుశిక్ష వేస్తూ సబ్ జడ్జి టి.వాసుదేవన్ శుక్రవారం తీర్పు వెలువరించినట్టు ఏపీపీ మజ్జి జగన్నాథం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన బూరాడ సూర్యనారాయణ దొంగనోట్లు కలిగి ఉన్నందుకు, వాటిని చలామణీ చేసినందుకు ఐదేళ్ల చొప్పున జైలుశిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా, రెండు కేసుల్లోనూ ఉన్నందుకు మరో రెండేసి వేల జరిమానాను విధించారన్నారు. అలాగే కేవలం దొంగనోట్లు కలిగి ఉన్నందుకు బూరాడ గురమ్మ, బూరాడ చంద్రమ్మ, సీహెచ్ నూకారెడ్డి, కొప్పిశెట్టి శ్రీనివాసరావు, దాసరి సత్యనారాయణలకు ఐదేళ్ల జైలు శిక్ష, రెండు వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారన్నారు. 2010లో నమోదైన ఈ కేసులో ఏడుగురు నిందితులు కాగా వీరిలో కంటు వెంకటమ్మ అనే మహిళ గతంలోనే మృతి చెందినట్టు ఏపీపీ జగన్నాథం తెలిపారు.

### ఐటీ యాక్ట్ కేసు నమోదు

**విజయనగరం క్రైమ్:** గుర్తు తెలియని వ్యక్తులు తన ఖాతా నుంచి నగదును విత్ డ్రా చేసినట్టు కామరాజు అనే వ్యక్తి వన్‌టౌన్‌పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కామరాజు అకౌంట్‌నుంచి ఆయనకు తెలియకుండా ఒకసారి రూ. 25వేలు, మరోసారి రూ.20వేలు మొత్తం రూ.45వేలు విత్ డ్రా అయినట్లు మెసెజ్‌లు రావడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

# నదిలో గల్లంతైన యువకుడి మృతి

- కడకెల్ల తీరంలో లభ్యమైన మృతదేహం



కార్తీక్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



మృతదేహం లభ్యమైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

**వీరఘట్టం:** నాగావళి నదిలో గల్లంతైన పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన యువకుడు అన్ను కార్తీక్(17) మృతదేహం మృతదేహం వీరఘట్టం మండలం కడకెల్ల సమీపంలోని నదీ తీరంలో శుక్రవారం లభ్యమైంది. గురువారం నదిలో గల్లంతైన కార్తీక్ జాడకోసం 24 గంటలుగా వెతుకున్న బంధువులకు మృతదేహమై కనిపించడంతో అంతా కన్నీటి పర్యంతమయ్యారు. అయితే నదిలో తరచూ జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియపోవడంతోనే కార్తీక్ నీట మునిగి ప్రాణాలు వదిలాడని బంధువులు, గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ద్వారపురెడ్డి ధనుంజయరావులు రోదించారు. ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టేవారిపై కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. అనంతరం ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. మృతుని తండ్రి వెంకట్ ఫిర్యాదుపై ఇన్‌చార్జ్ ఎస్సై కిశోర్‌వర్మ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

**డివైడర్‌ను ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..**



పొట్నూరి రాజేష్ (ఫైల్)

**భోగాపురం:** విజయనగరం జిల్లా గరివిడి మండలం శేరీపేట గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పొట్నూరి రాజేష్ (23) డివైడర్‌ను ఢీకొని శుక్రవారం మృతి చెందాడు. భోగాపురం మండలంలోని రాజాపులోవ జాతీయ రహదారిపై జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పొట్నూరి రాజేష్ కొమ్మాదిలో నివాసముంటూ విశాఖపట్నం బీచ్ రోడ్డులో ఉన్న మాలిటెక్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ (టీం మెంబర్) ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం స్నేహితుడు మూడుముళ్ల సురేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై విజయనగరం జిల్లా జొన్నాడ గ్రామంలో ఉన్న మరో స్నేహితుడు మొమ్ములూరి దినేష్ ఇంటికి వచ్చాడు. ముగ్గురు స్నేహితులు రోజంతా సరదాగా గడిపి రాత్రికి అక్కడే ఉండిపోయారు. శుక్రవారం వేకువజామునే రాజేష్, సురేష్‌లు ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం బయల్దేరారు. రాజాపులోవ వద్దకు చేరుకునేసరికి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో కింద పడిపోగా రాజేష్ తలకు గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సురేష్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భోగాపురం సీహెచ్‌సీకి తరలించారు. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న మృతుని తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తండ్రి సూర్యనారాయణ ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తవుడు తెలిపారు.

# జి-20 సదస్సుతో విశాఖకు మరింత గుర్తింపు



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పక్కన ఎమ్మెల్యే శంబంగి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

**రామభద్రపురం:** మూడు రోజుల పాటు నిర్వహించిన జి-20 సదస్సు ద్వారా విశాఖ నగరానికి మరింత గుర్తింపు లభించిందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన జి-20 సదస్సుకు 40 నుంచి సుమారు 200 మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారని వారి పర్యటన ద్వారా విశాఖ నగరానికి ప్రపంచ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు పెరిగాయన్నారు. ఇటీవల పలువురు పారిశ్రామిక ప్రతినిధులు వచ్చి విశాఖలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకువచ్చారన్నారు. దీంతో విశాఖపట్నం పరిపాలన రాజధానికి అనుకూలమని తేలిపోయిందన్నారు.ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవచూపుతున్నారన్నారు. కాబోయే పరిపాలనా రాజధాని విశాఖపట్నం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, శంబంగి వేణుగోపాలనాయుడు, అప్పికొండ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# ఆయువు తీసిన అక్రమ క్వారీ

- టీడీపీ నేత అక్రమ గ్రావెల్ క్వారీలో ప్రమాదం
- పనికి వెళ్లిన డిగ్రీ విద్యార్థి మృతి
- విషాదంలో కుటుంబ సభ్యులు



అక్రమ గ్రావెల్ క్వారీలో రక్తపు ఆనవాళ్లు



గారపేట-రెడ్డిపేట రహదారిపై బైఠాయించిన కుటుంబీకులు, గ్రామస్తులు



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

బగాది మణికంఠ (ఫైల్)

**పొందూరు/సంతకవిటి:** టీడీపీ నేతకు చెందిన అక్రమ క్వారీ ఓ విద్యార్థి మృతికి కారణమైంది. ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఈ విషాద ఘటన పొందూరు మండలం వీఆర్‌గూడెంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతకవిటి మండలం జీఎస్‌పురం గ్రామానికి చెందిన బగాది మణికంఠ(20) శ్రీకాకుళంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి లేకపోవడంతో తల్లి వెంకటలక్ష్మి కూలి పని చేస్తూ కుమారుడుతో పాటు కుమార్తె శారదను చదివిస్తోంది. సెలవులు రావడంతో నాలుగు రోజుల క్రితం మణికంఠ పొందూరు మండలంలోని వావిపల్లిపేటలో ఉంటున్న తాతయ్య సింహాచలం ఇంటికి వచ్చాడు. చేతి ఖర్చుల కోసం ఎవరిపైనా ఆధారపడకుండా అప్పుడప్పుడు గ్రావెల్ క్వారీ తవ్వకాల్లో పనికి వెళ్తుండేవాడు. వావిలపల్లిపేట సమీపంలోని వీఆర్‌గూడెంలో టీడీపీ నాయకుడు సువ్వారి మధుసూదనరావు అక్రమ గ్రావెల్ క్వారీ నిర్వహిస్తున్నాడు. అందులో గ్రావెల్ తీసుకెళ్లే వాహనాల నమోదు చేసే పని కోసం మణికంఠ గురువారం రాత్రి అక్కడికి వెళ్లాడు. పనిలో ఉన్న మణికంఠ పైనుంచి క్వారీ లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి జరగ్గా, క్వారీ నిర్వాహకులు మాత్రం శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

**గుట్టురట్టు కాకుండా...**

అక్రమ క్వారీలో జరిగిన ప్రమాదంలో యువకుడు చనిపోవడంతో మైనింగ్, పోలీసు డిపార్ట్‌మెంట్ల నుంచి కఠిన చర్యలు తప్పవని భావించిన నిర్వాహకులు గుట్టురట్టు కాకుండా ప్రయత్నాలు చేశారు. ఘటనా స్థలాన్ని మార్చేందుకు వ్యూహరచన చేశారు. క్వారీలో కాకుండా వేరే చోట ప్రమాదం జరిగినట్లు చిత్రీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. మృతదేహాన్ని కిలోమీటరు దూరం తీసుకువచ్చి జేవీఆర్ క్రషర్‌కు 100 మీటర్ల దూరంలోకి లారీని తీసుకువచ్చి మృతదేహాన్ని లారీ కింద పెట్టేశారు.

**కుటుంబీకుల ధర్నా..**

యువకుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. యువకుడు క్వారీలోనే చనిపోయాడని, కావాలనే అక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకువచ్చి పడేశారని మండిపడ్డారు. అక్రమ క్వారీల నిర్వహణతో ఎంతోమంది ప్రాణాలను పాట్టన పెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ క్వారీలను, మైనింగ్‌లను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ గారపేట-రెడ్డిపేట రహదారిలో ధర్నా చేపట్టారు. పొందూరు-చిలకపాలెం ప్రధాన రహదారి కావడంతో సుమారు రెండు కిలోమీటర్ల మీరకు వాహనాలు నిలిచిపోయాయి. కలెక్టర్, ఎస్పీ వచ్చి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

**నిర్వాహకులపై కేసు నమోదు..**

మృతుడు మణికంఠ తల్లి బగాది వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమ క్వారీ నిర్వాహకుడు సువ్వారి మధుసూదనరావు, లారీ డ్రైవర్ నాగరాజు, మరికొంత మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. గురువారం రాత్రి డ్రైవర్ నాగరాజు లారీని అజాగ్రత్తగా నడిపి మణికంఠ తలపైకి ఎక్కించడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. అక్రమ మైనింగ్ స్థలం అధికారులకు తెలిసిపోతుందనే భయంతో ఘటనా స్థలాన్ని మార్చేందుకు నిర్వాహకులు ప్రయత్నించారని తెలిపారు. సంఘటన స్థలాన్నే తారుమారు చేశారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

# సజావుగా పీడీఎస్ బియ్యం వేలం

- సహాయ పౌర సరఫరాల శాఖాధికారి అశోక్ సమక్షంలో పాట



తెర్లాంలో జరిగిన సీజ్ చేసిన పీడీఎస్ బియ్యం వేలంపాటలో పాల్గొన్న ఔత్సాహికులు, అధికారులు

**తెర్లాం:** జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌లో శుక్రవారం నిర్వహించిన సీజ్‌చేసిన పీడీఎస్ బియ్యం వేలం పాట సజావుగా జరిగింది. జిల్లా సహాయ పౌర సరఫరాల శాఖ అధికారి(ఏఎస్ఓ) బి.అశోక్ సమక్షంలో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, సీఎస్‌డీటీ గాడి భాస్కరరావులు సీజ్ చేసిన 428.5క్వింటాళ్ల పీడీఎస్ బియ్యానికి వేలం వేశారు. ఈ వేలంపాటలో విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి ఔత్సాహికులు పాల్గొన్నారు. జేసీ ఆదేశాల మేరకు కిలో బియ్యం ధర రూ.20లుగా నిర్ణయించి వేలంపాట ప్రారంభించగా బాడంగికి చెందిన ఉప్పల హరి కిలో బియ్యం రూ.22.30లకు పాడగా, బొబ్బిలికి చెందిన కోరాడ శ్రీనివాసరావు అదనంగా మరో10పైసలు వేసి కిలో బియ్యం రూ.22.40ల చొప్పున పాడుకున్నాడు. ఆ తరువాత మరెవరూ పాడకపోవడంతో కిలో రూ.22.40లు చొప్పున 428.5క్వింటాళ్లు పాటదారుకు చెందినట్లు అధికారులు ప్రకటించారు. వేలం పాటలో డీఎస్ఓ కార్యాలయ సీఎస్‌డీటీ గణపతిరావు, తెర్లాం ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము ఇన్‌చార్జ్ తదితరులు పాల్గొన్నారు.

# వ్రిందా ఆస్పత్రితో సెంచూరియన్ ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

**నెల్లిమర్ల రూరల్:** విశాఖపట్నానికి చెందిన వ్రిందా ఆస్పత్రితో టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీ శుక్రవారం ఎంఓయూ కుదుర్చుకుంది. ఆస్పత్రి ఎం.డి వంశీధర్, వర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజులు ఈ మేరకు పరస్పర అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల ఇంటర్న్‌షిప్, సదస్సుల నిర్వహణ తదితర అంశాలకు ఎంఓయూలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు | (100 గుడ్లు) |
|---|---|
| విశాఖపట్నం | రూ. 420.00 |
| విజయనగరం | రూ. 424.00 |
| శ్రీకాకుళం | రూ. 424.00 |

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 56,150-00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 51,800-00 |
| వెండి (కిలో) | 71,200-00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹105 | ₹180 | ₹ 190 |

# సీతం కళాశాలలో 'హ్యాకథాన్' సదస్సు

- 5నుంచి 8వ తేదీ వరకు నిర్వహణ

**విజయనగరం అర్బన్:** గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు 'స్మార్ట్ విజయనగరం' అనే అంశంపై 'హ్యాకథాన్' సదస్సు నిర్వహిస్తున్నామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు సదస్సు షెడ్యూల్‌ను విడుదల చేశారు. కళాశాల విద్యార్థులు రూపొందించిన 'ఒన్ వెబ్ డెవలప్‌మెంట్' ప్రోగ్రాంను ఈ సదస్సులో విడుదల చేస్తామని చెప్పారు. జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (వీసీ) ప్రొఫెసర్ కె.వెంటసుబ్బయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఈ సదస్సులో వివిధ యూనివర్సిటీలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. నాలుగురోజుల పాటు జరిగే ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, కంప్యూటర్ సైన్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జేసీకి ఎంఆర్‌పీఎస్ వినతి పత్రం



వినతి పత్రాన్ని అందుకుంటున్న జేసీ మయూర్ అశోక్

**విజయనగరం అర్బన్:** ఉషామెహర్ కమిటీ నివేదిక సమర్పించిన నేపథ్యంలో ఎస్సీలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించే ప్రక్రియ పూర్తి చేయాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు జిల్లా కమిటీలు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారులోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీల వర్గీరణ చేస్తామని హామీ ఇచ్చారని ఇంతవరకు అమలు కాలేదన్నారు. బీజేపీ ఇచ్చిన మాట ప్రకారం పార్లమెంట్ ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని జేసీ మయూర్ అశోక్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీను మాదిగ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు అప్పారావు మాదిగ, శంకరరావు మాదిగ, సాంబమూర్తి మాదిగ, నాగేశ్వరరావు మాదిగ, కిషోర్, సాగర్, రవి మాదిగ పాల్గొన్నారు.

# టీబీ మందుల వాడకం పరిశీలన

**విజయనగరం ఫోర్ట్:** క్షయ రోగులు మందులు వాడుతున్నది లేనిది క్షేత్ర స్థాయిలో పర్యటించి తెలుసుకోవాలని జిల్లా క్షయనివారణ అధికారి డాక్టర్ ఎస్. సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా క్షయ నివారణ కేంద్రంలో శుక్రవారం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కఫం పరీక్షల కోసం వచ్చిన వారికి సకాలంలో చేసి రిపోర్టులు అందజేయాలని, క్షయ రోగులందరికీ హెచ్ఐవీ పరీక్షలు చేయాలన్నారు. వృత్తి పట్ల చిత్త శుద్ధితో పనిచేయాలని హితవు పలికారు.

# వ్యక్తి హత్య

- కోడలు, ప్రియుడు కలిసి చంపేశారని మృతుడి తండ్రి ఫిర్యాదు



మృతుడు శ్రీను (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**గంట్యాడ:** మండలంలోని బుడతానపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీను (26) హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీరామనవమి సందర్భంగా పొరుగు గ్రామంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు చూసేందుకు శ్రీను బైక్‌పై గురువారం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం పెణసాం జంక్షన్ వద్ద శ్రీను చనిపోయి పడి ఉండడంతో అటుగా వెళ్లిన స్థానికులు గమనించి మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెంది ఉంటాడని అందరూ భావించారు. అయితే కొడుకు మృతి చెందిన విషయం తెలుసుకున్న శ్రీను తల్లిదండ్రులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించగా శరీరంపై, తలపైన గాయాలు ఉండడంతో తన కొడుకు భార్య, మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని వారిద్దరూ కలిసి తమ కొడుకును హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి వచ్చిన సీఐ తిరుపతిరావు, ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు సంఘట స్థలాన్ని, మృత దేహాన్ని పరిశీలించారు. హతుడు శ్రీను స్వస్థలం వేపాడ మండలంలోని సోంపురం. అత్తవారి ఊరైన బుడతానాపల్లి గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. మృతుడికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

**పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్య**



కొత్తవలస: ఆత్మహత్యకు పాల్పడిన శ్రీను (ఫైల్)

**కొత్తవలస:** అనారోగ్యం కారణంగా మనస్తాపానికి గురైన మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన నక్క శ్రీను(48) పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీను కొద్ది రోజులుగా మెదడుకు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున బాత్‌రూమ్‌లోకి వెళ్లి అప్పటికే అక్కడ దాచుకున్న పెట్రోల్‌ను వంటి మీద పోసుకుని నిప్పు పెట్టుకున్నాడు.గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి ఒక పాప, బాబు ఉన్నారు.

**పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నం**



పార్వతీపురం: చికిత్స పొందుతున్న నాగరాజు

**పార్వతీపురం/సీతానగరం:** మద్యం తాగవద్దని తండ్రి మందలించినందుకు మనస్తాపం చెందిన సీతానగరం మండలం బుడ్డిపేట గ్రామానికి చెందిన బి. నాగరాజు పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి సీతానగరం పీహెచ్‌సీకి చికిత్సకోసం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.